సాక్షి ఆదిలాబాద్

సోమవారం | 23 | జూన్ | 2025



అడవిలో యాంటీపోచింగ్ షెడ్లు

జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి రేంజ్‌లో మొదటిసారిగా మూడు చోట్ల యాంటీపోచింగ్ షెడ్ల నిర్మాణం చేపట్టారు. 8లో▸



క్షణ క్షణం.. భయం భయం

మావల కేజీబీవీలో వర్షం కురిస్తే పైకప్పు ఉరుస్తుంది. గతేడాది ఏ క్షణం ఏం జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ చదువుకున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'నేటి ధర్నా విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న గంగయ్య

ఇచ్చోడ: ఏఐటీయూసీ అనుబంధ, భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య కోరారు. ఆదివారం ఇచ్చోడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న ధర్నాకు జిల్లాలోని ప్రతీ మండలం నుంచి తాపీమేస్త్రీలు, పెయింటర్లు, ప్లంబర్లు, లేబర్ కార్మికులు అధికసంఖ్యలో హాజరుకావాలని సూచించారు. సమావేశంలో నాయకులు బో. దస్ రవి, బొజ్జ రాజ్‌కుమార్, గొలుసుల విజయ్, రాయుడు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి



సెల్ఫీ పాయింట్ వద్ద సీఐ కరుణాకర్‌రావు

ఆదిలాబాద్‌టౌన్: మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు అన్నారు. ఆదివారం టూటౌన్ పోలీసుస్టేషన్ ఎదుట యాంటీ నార్కొటిక్ వారోత్సవాల సందర్భంగా సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించడంతో ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా పోలీసులకు లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1908కు సమాచారం అందించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలని సూచించారు.


భీం విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఎదుట ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేయనున్న కుమురంభీం విగ్రహ ఏర్పాటుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆదివాసీ రాయిసెంటర్ సార్‌మేడీలకు లక్ష రూపాయల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయిసెంటర్ సార్‌మేడీలు మెస్రం వెంకట్‌రావ్, దుర్గు, దేవ్‌షావ్, ఆదివాసీ సంఘాల నాయకులు దేవ్‌రావ్, కొట్నాక్ బారిక్‌రావ్, మెస్రం ఆనంద్‌రావ్, కోసేరావ్, తదితరులు పాల్గొన్నారు.

వరుణ దేవుడా.. కరుణించు



పూజలు చేస్తున్న కనుగుట్ట గ్రామస్తులు

బోథ్: వర్షాలు కురవాలని బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామస్తులు ఆదివారం కప్పతల్లి ఆటలు ఆడారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. డప్పుచప్పుళ్లతో కప్పతల్లిని గ్రామంలో ఊరేగించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. బోథ్ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అడెల్లిలో భక్తుల పూజలు

సారంగపూర్: అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి ఆదివారం తెలంగాణతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్సై శ్రీకాంత్, ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్, ఈవో రమేశ్ పాల్గొన్నారు.

కుమ్మక్కయ్యారా.. ఆసక్తి లేకనా..!

- డీపీఆర్ రూపకల్పనకు టెండర్ల ఆహ్వానం
- రూ.కోటి విలువైన పనికి ఒకే టెండర్ దాఖలు
- కాంట్రాక్టర్ల తీరుపై సందేహాలు
- నేడు ఖరారు చేయనున్న అధికారులు



ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వరద కాల్వల సమస్యకు శాశ్వత పరిష్కారానికి సంబంధించిన సమస్యలపై బల్దియా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. గ్రేడ్–1 స్థాయికి ఎదిగిన ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ఈ సమస్యను దూరం చేసేలా చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ పథకమైన అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) కింద రూ.600 కోట్ల వ్యయంతో పనులు చేపట్టాలని అంచనా వేసింది. క్షేత్రస్థాయిలో ఆయా పనులను చేపట్టేందుకు అవసరమైన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్)ను తయారు చేసేందుకు టెండర్లు ఆహ్వానించింది. ఆసక్తి గల ఏజెన్సీల నుంచి టెండర్లను స్వీకరించింది. అయితే ఇందుకు ఒకే ఒక టెండర్ దాఖలు కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంలో కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారా.. లేక అవగాహన రాహిత్యంతో ముందుకు రాలేదా.. అనే దానిపై తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి. డీపీఆర్‌కు సంబంధించిన టెండర్లను సోమవారం ఖరారు చేయనున్నారు.

భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా..

గ్రేడ్–1 స్థాయికి ఎదిగిన ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధి రోజురోజుకూ విస్తరిస్తోంది. కొత్తగా పలు కాలనీలు వెలుస్తున్నాయి. దీంతో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, తాగునీటి సరఫరా ప్రాజెక్టులను, వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా వరద కాల్వలను నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంకల్పించారు. ఆ దిశగా బల్దియా యంత్రాంగాన్ని ఆదేశించారు. దీంతో ఆదిలాబాద్ పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం, తాగునీటి రిజర్వాయర్ల నిర్మాణాలకు రూ.600 కోట్లు అవసరం అవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందుకు అవసరమైన నిధులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్రానికి ఎమ్మెల్యే ప్రతిపాదనలు పంపారు.

డీపీఆర్ తయారీకి ఆదేశాలు..

ఎమ్మెల్యే ప్రతిపాదనలు పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు అవసరమైన డీపీఆర్‌ను పంపించాల్సిందిగా మున్సిపల్ అధికారులను ఆదేశించింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టిన బల్దియా అధికారులు ఇందుకు అర్హులైన ఆసక్తిగల ఏజెన్సీల నుంచి టెండర్లను ఆహ్వానిస్తూ ఈనెల 11న టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 19 వరకు అర్హులైన ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డీపీఆర్ తయారీకి అవసరమైన రూ.కోటి వ్యయాన్ని బల్దియా జనరల్ ఫండ్ నుంచి సంబంధిత ఏజెన్సీకి చెల్లించాలని నిర్ణయించారు. అయితే కోటి రూపాయల విలువైన డీపీఆర్ తయారీకి సంబంధించి ఒకే ఒక టెండర్ దాఖలు కావడం పలు అనుమానాలకు తావిస్తోంది.

డీపీఆర్ సిద్ధమైతేనే నిధులు విడుదల..

ఆదిలాబాద్ పట్టణంలో చేపట్టాల్సిన రూ.600 కోట్ల పనులకు సంబంధించిన సిద్ధం చేసిన డీపీఆర్‌ను జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. అక్కడి నుంచి కేంద్రానికి నివేదించనున్నారు. కేంద్రం అందుకు ఆమోదం తెలిపితే ఆ నిధులు విడుదల కానున్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేసేందుకు ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ జరుగుతుంది. అర్హులైన ఏజెన్సీల నుంచి దరఖాస్తులను స్వీకరించగా, ఒకే ఒక టెండర్ దాఖలైంది. దీన్ని ఈనెల 23న మధ్యాహ్నం 3 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో తెరవనున్నారు. ఒకే టెండర్ దాఖలు కావడంతో అదే ఏజెన్సీకి టెండర్ కట్టబెట్టే అవకాశం ఉంది. ఆ ఏజెన్సీ ఎవరనేది సీల్డ్ కవర్‌లో రావడంతో స్పష్టత లేదు. ఆ ఏజెన్సీ ఏదనేది సోమవారం తేలనుంది. సంబంధిత ఏజెన్సీ అందించే డీపీఆర్‌కు ఆమోదం లభిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు బల్దియా భాగస్వామ్యంతో కూడిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ కోసం రూ.350 కోట్లు, వరద కాల్వలకు రూ.110 కోట్లు మంజూరు కానున్నాయి.

పారదర్శకంగా టెండర్లు

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో రూ.600 కోట్లతో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, తాగునీటి రిజర్వాయర్లు, వరద కాల్వల నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ తయారీ కోసం టెండర్లు ఆహ్వానించాం. ఇందుకు ఈనెల 19 గడువు విధించగా ఒకేఒక టెండర్ దాఖలైంది. దానిని ఈనెల 23న ఖరారు చేస్తాం. ఈ వ్యవహారంలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహిస్తాం.

– పేరి రాజు, బల్దియా ఇంజనీర్

ఎస్‌హెచ్‌జీలకు మరింత ధీమా

- సభ్యులు ప్రమాదవశాత్తు మృతి చెందితే బీమా
- బాధిత కుటుంబాలకు రూ.10లక్షల ఆర్థికసాయం
- ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం
- జిల్లాలో 10 కుటుంబాలకు ప్రయోజనం



సమావేశం నిర్వహిస్తున్న ఏపీఎం (ఫైల్)

కైలాస్‌నగర్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా వడ్డీలేని రుణాలు అందజేస్తూ వారికి ఆర్థికంగా అండగా నిలుస్తోంది. చిరు వ్యాపారాల ద్వారా స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహిస్తోంది. దీంతో పాటు దురదృష్టవశాత్తు ప్రమాదంలో, అనారోగ్యంతో మృతి చెందిన సభ్యుల కుటుంబాలకు రుణ బకాయిల సర్దుబాటుతో పాటు రూ.10లక్షల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపారు. గతేడాదికి సంబంధించిన మృతులకు సైతం ఆర్థిక సాయం వర్తింపజేయాలని యోచిస్తోంది.

జిల్లాలో 10 మందికి లబ్ధి

బ్యాంకు లింకేజీ కింద రుణం పొందిన సభ్యులు అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లయితే లోన్ బీమా కింద రూ.2లక్షల వరకు వారు చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రభుత్వమే సర్దుబాటు చేయనుంది. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు పొందిన సభ్యులు ప్రమాదవశాత్తు మరణించినట్లయితే వారి కుటుంబాలకు రూ.10లక్షల ఆర్థికసాయం అందజేయనుంది. ఈ ఆర్థిక చేయూత పథకాన్ని గతేడాది మార్చి 14 నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. జిల్లాలో పది కుటుంబాలకు ఈ సాయం అందనుంది. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో ఎనిమిది కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. ఆర్థికసాయం, సర్దుబాటుతో పాటు స్త్రీనిధి రుణాలను నిర్దిష్ట గడువులోపు చెల్లించినట్లయితే ఏడాదికి 0.5శాతం ప్రోత్సాహకాలను సైతం అందజేయనుంది. కాగా, ప్రభుత్వం తాజాగా అమలు చేస్తున్న బీమా పథకంతో సభ్యులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు.

దరఖాస్తు ఇలా..

రూ.10లక్షల ఆర్థికసాయం కోసం సీసీల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. మృతి చెందిన సభ్యురాలి ఆధార్, పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, ఫొటోతో పాటు ఎస్‌హెచ్‌జీ, వీవోల తీర్మానాలు తప్పనిసరిగా అందించాల్సి ఉంటుంది. ఈ వివరాలపై అసిస్టెంట్ మేనేజర్ విచారణ చేపట్టి ఆమోదించాల్సి ఉంటుంది. దాన్ని స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ పరిశీలించి రాష్ట్రస్థాయికి పంపిస్తారు. అక్కడ ఆమోదం లభిస్తే డీఆర్డీవో లాగిన్‌కు తుది ఉత్తర్వులు అందుతాయి. వాటి ఆధారంగా ఆర్థిక సాయం చెల్లించనున్నారు.

జిల్లాలో..

గ్రామ సమాఖ్య సంఘాలు	554
మండల సమాఖ్యలు	18
స్వయం సహాయక సంఘాలు	10,754
అందులోని సభ్యులు	1,19,451
పట్టణ స్వయం సహాయక సంఘాలు	416
అందులోని సభ్యులు	4,164

మహిళా సభ్యులకు కొండంత ధీమా

స్వయం సహాయక సంఘాల సభ్యులుగా ఉండి ప్రమాదవశాత్తు మృతి చెందితే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.10లక్షల ఆర్థికసాయం అందించాలని నిర్ణయించింది. మొదటి విడత జిల్లాలకు నిధులు కూడా విడుదల చేసింది. 10 మంది కుటుంబాలకు ప్రయోజనం చేకూరుంది. ఎస్‌హెచ్‌జీ సభ్యుల కుటుంబాలకు ఇది కొండంత ధీమా ఇవ్వనుంది.

– పూర్ణచందర్, స్త్రీనిధి, రీజినల్ మేనేజర్

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

తలమడుగు: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతీ కార్యకర్త సిద్ధంగా ఉండి సైనికుల్లా పని చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం తలమడుగు మండలం ఉండం గ్రామంలోని ఆయుష గార్డెన్‌లో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి వికసిత్ భారత్ నిర్మాణానికి అందరూ కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలే గ్రామీణ ఎన్నికలకు బలమని, అందరూ కలిసికట్టుగా పనిచేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం, ఉపాధ్యక్షులు సామా సంతోష్‌రెడ్డి, పార్లమెంటు కోకన్వీనర్ మయూర్ చంద్ర, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాబారావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజు, మండల కన్వీనర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ను కోల్పోవడం బాధాకరం

- ఎస్పీ అఖిల్ మహాజన్



పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు కానిస్టేబుల్‌ను కోల్పోవడం బాధాకరమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కోర్టు విధులు నిర్వహిస్తున్న పద్మవార్ ప్రకాష్(46) ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ టూటౌన్‌కు కోర్టు విధులకు వస్తున్న క్రమంలో ఆదివారం బస్సులో గుండెపోటుకు గురయ్యాడు. రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఉట్నూర్‌లోని ఆయన నివాసానికి చేరుకున్న పార్థివదేహానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తక్షణ ఆర్థిక సహాయం కింద బాధిత కుటుంబ సభ్యులకు రూ.30 వేలు అందించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అంత్యక్రియల్లో టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, ఎస్సై మొగిలి, సిబ్బంది పాల్గొన్నారు.

'కొత్త స్కూళ్లు కాదు..ఉన్నవి బాగుచేయండి'



మాట్లాడుతున్న చావ రవి

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్రంలో పబ్లిక్ స్కూళ్ల సమీకృత గురుకులాల పేరుతో కొత్త స్కూళ్లను నెలకొల్పడం కాదని, ఉన్న స్కూళ్లనే బాగు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో విద్యారంగం వివక్షకు గురైందన్నారు. గతేడాది 16 వేల ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో లక్షా 20 వేల మంది చేరితే, 11వేల ప్రైవేట్ పాఠశాలల్లో 5 లక్షల మంది చేరారన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ, కేజీ తరగతులు కూడా ఉండటం ఇందుకు కారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభిస్తామని ఆర్భాటంగా చెప్పి కేవలం 250 పాఠశాలల్లో మాత్రమే అనుమతించారన్నారు. కొత్త పాఠశాలలతో నష్టమే తప్పా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు వెంటనే చేపట్టాలని, హెల్త్ కార్డులు అందించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, మధ్యాహ్న భోజన ధరలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిష్టన్న, అశోక్, సంఘ బాధ్యులు సూర్యకుమార్, శ్రీనివాస్, స్వామి, ఇస్తారి, గౌస్ మొయినొద్దీన్, శివన్న, గణేశ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీకి 20,258 దరఖాస్తులు

- జూలై 4న సెలక్షన్ లిస్ట్ విడుదల
- 7 నుంచి ధ్రువపత్రాల పరిశీలన



భైంసా: 2025–26 విద్యాసంవత్సరానికి బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 20,258 దరఖాస్తులు వచ్చాయి. ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి పదో తరగతిలో ఉత్తీర్ణులైనవారి నుంచి ఈ నెల 21వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. 1,500 సీట్లుండగా ఒక్కో సీటుకు 14 మందికిపైగా పోటీపడుతున్నారు.

క్రమంగా తగ్గుతున్న పోటీ

ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి క్రమంగా విద్యార్థుల దరఖాస్తుల సంఖ్య తగ్గుతోంది. 2020–21 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం 32వేల మంది, 2021–22లో 20,178, 2022–23లో 31,432, 2023–24లో 32,635, 2024–25లో 15వేలు, 2025–26 విద్యాసంవత్సరంలో 20,258 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు పరిశీలించి జూలై 4న సెలక్షన్ లిస్ట్ విడుదల చేస్తామని ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. జూలై 7నుంచి సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యా విధానం ఇలా..

ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సుల్లో భాగంగా తొలి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ బోధిస్తారు. ఇందులో మెరిట్ ఆధారంగా నాలుగేళ్ల బీటెక్ కోర్సుకు వివిధ బ్రాంచ్‌లలో సీట్లు కేటాయిస్తారు. బీటెక్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈసీఈ, ఎంఎంఈ కోర్సులు బోధిస్తారు.

క్యాంపస్‌లో వసతులు

ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, యూనిఫాంలు, షూస్, స్పోర్ట్స్ డ్రెస్ ఇస్తారు. హాస్టల్, భోజన వసతి యూనివర్సిటీలోనే ఉంటుంది. ఆటలు, వ్యాయామం, సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకు తరగతులు నిర్వహిస్తారు. క్యాంపస్‌లోనే ప్రత్యేక వైద్యశాల, అధునాతనమైన ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి.

దీనావస్థలో యూఆర్‌ఎస్‌లు

- అద్దె భవనాలు.. అరకొర వసతులు
- సరిపడా లేని బోధకులు, సిబ్బంది
- అధ్వానంగా అర్బన్ రెసిడెన్షియల్స్
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: బడిబయటి బాలురను బడిబాట పట్టించి బంగారు భవితకు బాట వేయడానికి 2017లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వీటిని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయాలుగా పిలుస్తున్నారు. విధి వంచితులు, అనాథలు, వలస బాల కార్మికులు, నిరుపేద కుటుంబాలకు చెందిన బాలుర కోసం వీటిని నెలకొల్పారు. బాలికలకు కేజీబీవీల మాదిరి బాలుర కోసం వీటిని ఏర్పాటు చేశారు. రెసిడెన్షియల్ స్థాయిలో యూఆర్‌ఎస్‌లను ప్రారంభించారు. ఈ స్కూళ్లలో కేజీబీవీ ఉపాధ్యాయులతో సమానంగా విద్యార్హతలు, జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని ఉపాధ్యాయులుగా నియమించారు. 'అన్నీఉన్నా అల్లుడి నోట్లో శని' అన్నట్లు స్కూల్ అసిస్టెంట్ స్థాయిలో బోధన చేయగలిగే ఉపాధ్యాయులు యూఆర్‌ఎస్‌లో ఉన్నప్పటికీ ఒక్క తరగతి కూడా అప్‌గ్రేడ్ చేయలేదు. వీటితో ప్రారంభమైన కేజీబీవీలు ఇంటర్ కళాశాలలుగా ఉన్నతీకరణ చెందాయి. వీటిలో కేవలం మూడోతరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు మాత్రమే విద్యాబోధన సాగుతోంది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేయగా ఒక్కో పాఠశాలలో వంద చొప్పున విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. ఎనిమిదేళ్ళు గడుస్తున్నా కనీసం భవన నిర్మాణానికి స్థల సేకరణ జరగకపోవడం శోచనీయం.

తిండికీ తిప్పలే..

అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో ప్రతీ విద్యార్థికి కేవలం నెలకు రూ.1,049 కేటాయిస్తుండగా, ప్రతీ రోజు రూ.35 మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ మెస్ చార్జీలతో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించలేకపోతున్నారు. 2022–23 విద్యాసంవత్సరం వరకు కేజీబీవీ విద్యార్థినులతో సమానంగా మెస్ చార్జీలు చెల్లించేవారు. కానీ 2023–24, 2024–25 విద్యాసంవత్సరంలో మాత్రం కేజీబీవీ విద్యార్థినులకు రూ.1,225 ఇస్తుండగా, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు మాత్రం కేవలం రూ.1,049తోనే సరిపెడుతున్నారు. ఈ విద్యాసంవత్సరం యూఆర్‌ఎస్ విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచినట్లు తెలుస్తోంది. అవి ఏమేరకు అమలులోకి వస్తాయో చూడాలి. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, డార్మెంటరీలు, టాయిలెట్లు, వంటగదులు, భోజనశాలలు లేవు. విద్యార్థులకు ట్రంక్‌పెట్టెలు, ఇవ్వడం లేదు. తాగునీటికోసం ఆర్వో ప్లాంట్లు గానీ చలికాలంలో వేడినీళ్లతో స్నానానికి హీటర్లు గానీ ఇవ్వడం లేదు. కనీసం విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు కూడా సమకూర్చడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ఓవైపు డిజిటల్ బోర్డులు ఇస్తుండగా వీరికి నల్లబల్లాలు కూడా సరిగ్గా లేవు.

అన్నింటా పక్షపాతమే..

రాష్ట్ర వ్యాప్తంగా 29 అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో డ్రాపౌట్ పిల్లలు, విధి వంచిత బాలురు, ఆర్ఫాన్, సెమి ఆర్ఫాన్ పిల్లలు, నిరుపేద కుటుంబాలకు చెందిన బాలురు, వలసకు వెళ్లే కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుకుంటున్నారు. వీరికి విద్యాబుద్ధులు నేర్పి మెయిన్ స్ట్రీమ్ చేయడమే ప్రధాన లక్ష్యంగా ఈ పాఠశాలలు పనిచేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో చదువుతున్న ప్రభుత్వ విద్యార్థులకు తరగతికి సంబంధించిన కనీస ప్రమాణాలు కొరవడుతున్నాయని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే తేల్చి చెప్పింది. అనేక విద్యాసంబంధిత సర్వేలు కూడా ప్రభుత్వ విద్యార్థుల ప్రమాణాలు ఆశాజనకంగా లేవని తమ నివేదికల్లో పేర్కొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు కార్యశాలలుగా కీలకంగా మారాయి. ఏటా యూఆర్‌ఎస్‌లో చదువుకున్న అనేక మంది విద్యార్థులు గురుకులంలో సీట్లు సాధిస్తున్నారు. అన్ని విధాలుగా కేజీబీవీలతో సమానంగా ఎదగాల్సిన యూఆర్‌ఎస్‌లో కనీసం ఒక్క కంప్యూటర్ కూడా లేదు. విద్యార్థుల హాజరు నమోదుకు ఇతర ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చినట్లుగా ట్యాబులు కూడా ఇవ్వడం లేదు.

పోస్టుల మంజూరేది..

పూర్తిస్థాయి వసతి గృహ సౌకర్యంతో పాఠశాలలు నడుస్తున్నప్పటికీ అత్యంత కీలకమైన ఏఎస్‌ఎం పోస్టులు ఈ పాఠశాలకు మంజూరు చేయడం లేదు. వసతి గృహాల్లో అపరిశుభ్ర వాతావరణంలో అనారోగ్యం బారిన పడుతున్న పిల్లల గురించి వార్తల్లో ఎక్కుతున్నా ఈ పాఠశాలలకు కనీసం ఏఎన్‌ఎంలను కూడా నియమించడం లేదు. పిల్లల మానసిక, శారీరక వికాసానికి ముఖ్యమైన పీఈటీ పోస్టును, హిందీ టీచర్ పోస్టులను గెస్ట్ పద్ధతిలో నియమించుకోవాలని ఆదేశాలున్నప్పటికీ అతితక్కువ వేతనం (నెలకు రూ.5వేలు)తో పనిచేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. భౌతిక రసాయన శాస్త్రం ఉపాధ్యాయుల పోస్టును మంజూరు చేయడం లేదు. పిల్లలకు మార్గనిర్దేశం చేయడానికి పాఠశాలకు కౌన్సిలర్‌ను నియమించుకునే అవకాశం ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు.

ఇబ్బందులు కలగకుండా చర్యలు



అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతాం. అవసరమైన సౌకర్యాలు కల్పిస్తాం. పీఈటీ, ఏఎస్‌ఎం పోస్టుల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో, ఆదిలాబాద్

క్లుప్తంగా

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ


బాధితురాలు భూదమ్మ

చెన్నూర్‌రూరల్: వృద్ధురాలి మెడలో గొలుసును ఇద్దరు చోరీకి పాల్పడ్డారు. మండలంలోని సుబ్బరాంపల్లి సమీపంలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుబ్బరాంపల్లి గ్రామానికి చెందిన రాతిపల్లి భూదమ్మ శనివారం పని నిమిత్తం అంగ్రాజ్‌పల్లి గ్రామానికి వెళ్లింది. అక్కడకు ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి మీతో పని ఉందని మీ ఊరికే వెళ్తున్నామని చెప్పి నమ్మించారు. బైక్‌పై తీసుకుని సుబ్బరాంపల్లి సమీపంలో దించి ఆమె మెడలో మూడు తులాల బంగారు గొలుసును లాక్కున్నారు. భూదమ్మ గట్టిగా అరవడంతో ఇద్దరు బైక్‌పై పరారయ్యారు. బాధితురాలి కుటుంబ సభ్యులు చెన్నూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పేకాటస్థావరంపై దాడి

వాంకిడి: పేకాడుతూ పట్టుబడిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. మండలంలోని బంబార శివారులో రహస్యంగా పేకాటస్థావరం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి మఫ్టీలో ఆదివారం దాడులు నిర్వహించారు. 9 మందిని అదుపులో తీసుకుని వారివద్ద రూ.2500 నగదును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా పేకాట ఆడుతున్నారని తెలిస్తే 87126 70531 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

బ్లేడ్ ట్రాక్టర్ తగిలి మహిళా రైతు మృతి


లక్ష్మి (ఫైల్)

పెంబి: చేనులో చదును చేస్తున్న బ్లేడ్ ట్రాక్టర్ వెనుకకు వచ్చే క్రమంలో నాగలికి తగిలి మహిళా రైతు అక్కడికక్కడే మృతి చెందింది. మండలంలోని నాగాపూర్ గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై హన్మండ్లు కథనం ప్రకారం..గ్రామానికి చెందిన పోతురాజు లక్ష్మి(40) తన చేనులో ఆదివారం బ్లేడ్ ట్రాక్టర్‌తో చదును చేయిస్తున్న సమయంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో వెనుకకు వచ్చే క్రమంలో నాగలి ఆమె తలకి తగిలి మృతిచెందింది. పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి అనుప ఎల్లయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉంది. భర్త, కుమారుడు ఉపాధి కోసం విదేశాలకు వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.


విద్యుత్ షాక్‌తో ఎద్దులు మృతి


జంబుగలో ఎద్దు కళేబరం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జంబుగ గ్రామంలో ఆదివారం విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి చెందింది. గజ్జిగూడకు చెందిన గాజుల మొండయ్యకు చెందిన ఎద్దు మేతకోసం వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలి అక్కడికక్కడే మృత్యువాతపడింది. దీని విలువ రూ.60 వేలు ఉంటుందని, అధికారులు తనకు పరిహారం ఇప్పించాలని కోరారు. ఈజ్‌గాం ఏఎస్సై హీరామన్, పశువైద్యాధికారులు ఈ సంఘటన స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఈ ప్రమాదం జరిగిందని బాధితుడు ఆరోపించాడు. అందుకే అధికారుల రాలేదని, తనకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని బాధితుడు తెలిపాడు.

భీమిని: మండలంలోని వెంకటపూర్ పంచాయతీ పరిధిలో ఆదివారం విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందింది. గ్రామ శివారులో మేతకు వెళ్లిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తగిలి మృతి చెందినట్లు బాధిత రైతు కోట నగేశ్ తెలిపాడు. దీని విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని వేడుకున్నాడు.

ఖాళీ బిందెలతో నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో మిషన్ భగీరథ, గ్రామపంచాయతీ నీళ్లు రాక 15రోజులుగా ఇబ్బందులు పడుతున్నామని మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే స్పందించి వెంటనే నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా మండల అధ్యక్షుడు ఆటుకాపురం రమేశ్, నీలాల జయ, నర్సమ్మ, పుష్పలత, స్వప్నా, లావణ్య, రజిని, జ్యోతి, రాజమ్మ, లక్ష్మి తదితరులున్నారు.

అడవిలో యాంటీపోచింగ్ షెడ్లు


అడవిలో నిర్మించిన యాంటీ పోచింగ్ షెడ్డు

- ఇందన్‌పల్లి రేంజ్‌లో నిర్మాణం
- సిబ్బందికి సౌకర్యాలు

జన్నారం: రాత్రి,పగలు అడవిలో తిరుగుతూ వన్యప్రాణుల సంరక్షణ కోసం తమవంతుగా కృషి చేస్తున్న యాంటీపోచింగ్ సిబ్బందికి అటవీశాఖ నివాస సౌకర్యం కల్పించింది. అడవిలో అందమైన షెడ్ల నిర్మాణం చేపట్టింది. వాన, వేసవి, చలికాలాల్లో నీడ సౌకర్యం కోసం, సిబ్బంది బస చేసేందుకు వీలుగా టైగర్‌జోన్‌లోని జన్నారం డివిజన్‌లో మొదటిసారిగా ఇందన్‌పల్లి రేంజ్‌లో షెడ్ల నిర్మాణం చేపట్టింది.

రేంజ్‌లో మూడుచోట్ల

జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి రేంజ్‌లో మొదటిసారిగా మూడు చోట్ల యాంటీపోచింగ్ షెడ్లు నిర్మాణం చేపట్టారు. ప్రతి ఏటా వచ్చే నిధులతో ఈసారి సిబ్బంది కోసం షెడ్ల పనులు చేపట్టారు. ఇదిలా ఉంటే ఒక్కో యాంటీపోచింగ్ టీంలో ఐదుగురు సిబ్బంది ఉంటారు. వీరు ఉదయం నుంచి సాయంత్రం వరకు అడవిలోనే తిరుగుతూ వన్యప్రాణులు, అడవుల రక్షణ కోసం పని చేస్తుంటారు. సాయంత్రం, ఉదయం వంట, సామగ్రిని షెడ్లలో ఉంచుకుని తిరిగి రాత్రి ఇక్కడే బస చేస్తారు. సిబ్బంది రాత్రి ఉండేందుకు జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ ఆదేశాల మేరకు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ ఈ నిర్మాణాలు చేపట్టారు. వీటి పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో షెడ్లను ప్రారంభించనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో..



యాంటీపోచింగ్ సిబ్బందికి అడవిలో సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో రేంజ్ పరిధిలో మూడు షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలో ప్రారంభిస్తాం.
– కారం శ్రీనివాస్, రేంజ్ అధికారి

సిబ్బంది విధులు

స్మగ్లింగ్ నిరోధానికి అటవీ అధికారులతోపాటు బేస్‌క్యాంపు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరి కోసం ఇప్పటికే డివిజన్‌లో బేస్‌క్యాంపులు నిర్మించారు. వారు రాత్రి, పగలు అడవిలో ఉంటూ స్మగ్లింగ్ నిరోధానికి, అడవుల ఏదైన సమస్య ఉంటే అధికారులకు సమాచారం ఇస్తారు. వన్యప్రాణుల సంరక్షణకు, ఏదైన వన్యప్రాణి గాయపడ్డ అక్కడికి చేరుకుని వాటిని కాపాడటం కోసం యాంటీపోచింగ్ సిబ్బందిని నియమించారు. వన్యప్రాణులకు నీటి సౌకర్యం, ఆహారం కల్పించడానికి అటవీ అధికారుల ఆదేశాల మేరకు పని చేస్తుంటారు. వర్షాకాలంలో గడ్డి పెంపకం, వేసవిలో నీటి సౌకర్యం కోసం పనిచేస్తుంటారు. వీటితోపాటు స్మగ్లింగ్, వేట నిరోధం కోసం అటవీశాఖ అధికారుల ఆదేశాల ప్రకారం పని చేస్తుంటారు.

అండర్–19 క్రికెట్ జట్టు ఎంపిక


ఎంపికైన క్రికెట్ జట్టు

మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–19 ఎంపిక పోటీల్లో 15 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఆదివారం ఎంపిక చేసినట్లు కోచ్ ప్రదీప్ తెలిపారు. ఎంపికైన వారిలో మందమర్రికి చెందిన సింహాద్రి, లక్ష్మణ్, రాంయాదవ్, మంచిర్యాల నుంచి ఐ. సందీప్, అశ్రిత్, అక్షయ్, ఆదిలాబాద్ నుంచి దర్శ్ అగర్వాల్, ఇస్రాయేల్, మొహమ్మద్ ఆనస్, రాజబాబు, రాహుల్, అద్నాన్, ముల్కల్లకు చెందిన చరణ్, ఉట్నూర్‌కు చెందిన ముసాదిక్, ఆసిఫాబాద్‌కు చెందిన కార్తికేయ ఉన్నారు. స్టాండ్‌బైలో మంచిర్యాలకు చెందిన జె. సంతోశ్, సాయిరామ్, ఆదిలాబాద్‌కు చెందిన ఎస్‌డి అనస్, సైఫ్ బిన్ సోహైల్, లక్కీ జాదవ్‌లను ఎంపిక చేశారు. జిల్లా జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో త్వరలో నిర్వహించే టోర్నమెంటులో ఆడుతుందని తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: మంచిర్యాల–పెద్దంపేట రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మృతుడు మంచిర్యాలలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన వానరాసి మల్లేశ్ (37)గా గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో భద్రపర్చి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఒకరిపై దాడి

తానూరు: మండలంలోని జౌలా(కే) గ్రామానికి చెందిన ఇప్తెకర్ సిద్ధిరాంపై అదే గ్రామానికి చెందిన కొందరు కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేసినట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత వారం క్రితం అదే గ్రామానికి చెందిన ప్రదీప్, సిద్ధిరాంలు ఫోన్ విషయమై మద్యం మత్తులో గొడవపడ్డారు. మాటమాట పెరిగి సిద్ధిరాం ప్రదీప్‌ని కర్రతో కొట్టి అక్కడి నుంచి మహారాష్ట్రకు వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని ప్రదీప్ తన సోదరులకు తెలిపాడు. ప్రదీప్ సోదరులు సిద్ధిరాం రాక కోసం ఎదురుచూశారు. అతను శనివారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. ప్రదీప్ సోదరులు, కుటుంబ సభ్యులు అతన్ని హత్య చేయాలనే పథకం పన్ని కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేశారు. తీవ్ర గాయాలైన సిద్ధిరాంను కుటుంబ సభ్యులు భైంసా ఆస్పత్రికి తరలించారు. ఈ దాడి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. విషయం తెలుసుకున్న భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఆదివారం జౌలా(కే) గ్రామానికి చేరుకుని జరిగిన ఘటనపై ఆరా తీశారు. సిద్ధిరాం ఫిర్యాదు మేరకు ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని ట్రైయినీ ఎస్సైకి సూచించారు.

మాస్క్ ధరించి.. బంగారం అపహరించి

- భైంసాలోని ఓ ఇంట్లో 31 తులాలు చోరీ


ఇంట్లో చిందరవందరగా వస్తువులు

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్‌లో శనివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. బాధితులు, పట్టణ సీఐ జి.గోపీనాథ్ కథనం ప్రకారం.. రాహుల్‌నగర్‌లోని నివాసముంటున్న మచ్చ గజ్జారాం, పంచపూల దంపతులు శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి నర్సాపూర్(జి)లోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఇంటి గేటు, తలుపులు తెరిచి ఉండడం గమనించిన స్థానికులు వారి కుమారుడికి సమాచారమిచ్చారు. ఆయన వెంటనే నర్సాపూర్(జి)లో ఉన్న తల్లిదండ్రులకు తెలిపి, భార్యతో కలిసి మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. లోనికి వెళ్లి వెళ్లి చూడగా బీరువా, వస్తువులు చిందరవందరగా ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ జి. గోపీనాథ్, ఎస్సై గౌసుద్దీన్ చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనలో 31 తులాల బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు, ఒక ప్రొఫెషనల్ కెమెరా అపహరణకు గురైనట్లు పేర్కొన్నారు. ఇంట్లో సీసీ పుటేజీ పరిశీలించగా మాస్క్ ధరించిన ముగ్గురు దుండగులు ఇంట్లోకి ప్రవేశించిన దృశ్యాలు నమోదయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

బాలికపై వేధింపులు.. ఎనిమిది మందిపై పోక్సో కేసు

గుడిహత్నూర్: సోషల్ మీడియాలో స్నేహం పేరుతో ఓ బాలికను వేధింపులకు గురిచేసిన కేసులో ఎనిమిది మందిని శనివారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికతో మండల కేంద్రానికి చెందిన ఓ బాలుడు పరిచయం పెంచుకున్నాడు. అప్పటి నుంచి ఫోన్‌లో చాటింగ్ చేస్తున్నాడు. ఒక రోజు తనకు న్యూడ్ వీడియో కాల్ చేయాలని, లేదంటే చాటింగ్ అందరికీ తెలిసేలా చేస్తానని బెదిరించాడు. ఆ బాలిక ఒకరోజు న్యూడ్ కాల్‌చేసి మాట్లాడుతుండగా వీడియోను స్క్రీన్ రికార్డు చేసి తన ఏడుగురు స్నేహితులకు పంపించాడు. వారు వీడియోను అడ్డం పెట్టుకుని బాలికను మానసికంగా వేధింపులకు గురి చేయడం ప్రారంభించారు. ఓ యువకుడు ఏకంగా ఆ వీడియోను సోషల్ మీడియాలో పెట్టడంతో బాలిక తన కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. బాలిక తండ్రి పోలీసులను ఆశ్రయించడంతో షీటీం పోలీసులు ఎనిమిది మందిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నారని తెలిపారు. ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఏఎస్పీ వివరించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్న వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఆశగిరి హన్మాండ్లుకు వైద్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. శాంతినగర్‌కు చెందిన రంగినేని శ్రీనివాస్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.10 లక్షలు తీసుకుని మోసం చేశాడు. ఉద్యోగం ఇప్పించకుండా రేపుమాపు అంటూ తిప్పుకుంటూ బాధితుడిని ఇబ్బందులకు గురిచేశాడు. ఈనెల 8న బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఆదివారం రంగినేని శ్రీనివాస్ అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

మోసం చేసిన ముగ్గురిపై..

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలో భూ లావాదేవీల్లో మోసం, బెదిరింపులకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల పోలీసు స్టేషన్ పరిధిలోని పలువురు బాధితుల నుంచి ప్లాట్ల కొనుగోలు కోసం డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసినట్లు వివరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన ఇద్దరిపై..

జన్నారం: ఇచ్చిన అప్పు డబ్బులు అడిగే క్రమంలో నిర్వహించిన పంచాయితీలో వ్యక్తిపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు. ఆదివారం సాయంత్రం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రెండ్లగూడ గ్రామానికి చెందిన నెమలికొండ ఆశరాజ్ అప్పు తీసుకున్న డబ్బులు ఇవ్వాలని ధర్మారానికి చెందిన మగ్గిడి తిరుపతి అతని తమ్ముడు మగ్గిడి వెంకటేశ్‌లు ఈనెల 21న పంచాయితీ నిర్వహించారు. ముత్యం రాజన్న అతను డబ్బుల విషయమై శాంతియుతంగా పరిష్కరించుకోవాలని చెప్పారు. కోపంతో మగ్గిడి తిరుపతి, మగ్గిడి వెంకటేశ్‌లు తనపై దాడి చేశారని ముత్యం రాజన్న ఫిర్యాదుతో ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై అట్రాసిటీ..

నెమలికొండ ఆశరాజ్ డబ్బులు ఇవ్వాలని అడుగగా నన్ను, తమ్ముడు వెంకటేశ్, తల్లి అమృతలను బూతులు తిట్టి, కొట్టారని మగ్గిడి తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముత్యం రాజన్నపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు. ఇరువర్గాలపై నమోదైన కేసులపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దాడి చేసిన ఐదుగురిపై..


తానూరు: మండలంలోని జౌలా(బి) గ్రామానికి చెందిన లోకండే భీంరావ్ అతని భార్య రాణిపై దాడిచేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..లోకండే తుకారం నూతనంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ఈనెల 18న గోడలకు నీటిని అందిస్తుండగా భీంరావ్ ఇంటి రేకులపై నీరు పడ్డాయి. ఈక్రమంలో భీంరావ్, తుకారాం మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈనెల 19న రాత్రి మళ్లీ గొడవ జరగడంతో తుకారం అతని కుమారుడు ధమ్మ, కుమార్తె రమాబాయి కుమారులు బబ్లు, కరణ్‌లు భీంరావ్ అతని భార్య రాణిపై కర్రలతో దాడి చేశారు. తీవ్ర గాయాలైన భీంరావ్, రాణి భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తుకారం, ధమ్మ, రమాబాయి, బబ్లు, కరణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు.

పశువులు పట్టివేత


పట్టుకున్న నిందితులతో పోలీసులు

కౌటాల: మండలంలోని హెట్టి గ్రామం నుంచి అక్రమంగా వాహనాల్లో తరలిస్తున్న పశువులను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు. శనివారం రాత్రి హెట్టి నుంచి మూడు బొలెరో వాహనాల్లో 18 ఆవులు, 10 దూడలు, 4 ఎద్దులను అక్రమంగా త రలిస్తుండగా పట్టుకున్నామని పేర్కొన్నారు. మూడు బొలెరో వాహనాలు, రెండు కార్లను సీజ్ చేసి పట్టుకున్న 32 పశువులను కౌటాల బంజారు దొడ్డిలో ఉంచినట్లు తెలిపారు. పశువులను అక్రమంగా తరలిస్తున్న షేక్ శుజాఉద్దీన్, అయుబ్‌ఖాన్, హమీద్ పాషా, జమీర్, మొబీన్, రఫీ, ఫాషీ, అహ్మద్, అబ్దుల్లా, జహీర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అదుపుతప్పిన కారు


గాయపడిన శ్రీధర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని గుల్జార్ మార్కెట్‌లో ఆదివారం కారు అదుపుతప్పిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. ఓ కారు పోలీస్‌స్టేషన్ వైపు నుంచి మార్కెట్ వైపు వస్తూ మసీదు ఎదుట ఉన్న రెండు బజ్జీల బండ్లు, ఒక బైక్‌ను ఢీకొంది. ఘటనలో కారుడ్రైవర్ శ్రీధర్‌తోపాటు గౌస్‌ఖాన్‌కు గాయాలయ్యాయి. షేక్ అహ్మద్‌పై వేడి నూనె పడి గాయపడ్డారు. అజాగ్రత్త వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆదివాసీ యువ రైతు ఐడియా అదుర్స్



ఇంద్రవెల్లి మండలం దోదంద గ్రామానికి చెందిన ఆదివాసీ యువ రైతు తుంరం ధాను వినూత్నంగా ఆలోచించాడు. ఆదివారం తన చేనులో మొక్కజొన్న విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యాడు. ట్రాక్టర్‌పై ఐదుగురు మహిళ కూలీలను కూర్చునేలా ఏర్పాటు చేసి వారితో ఒక్కరోజే 40 బ్యాగుల మొక్కజొన్న విత్తనాలు నాటించి అందరినీ ఆకట్టుకున్నాడు. యువ రైతు ఐడియా అదుర్స్ అంటూ పలువురు కొనియాడారు. – ఇంద్రవెల్లి

ఆత్మీయ సమ్మేళనం



తాంసి మండలం కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000–01 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 25 ఏళ్ల తర్వాత వీరి ఆత్మీయ సమ్మేళనానికి పాఠశాల వేదికైంది. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం ఆనంద్, పూర్వ ఉపాధ్యాయులు ఆదినాథ్, శ్రీనివాస్, మనోహర్, విజయతోపాటు రఫీ, అనిల్, సరిత, స్వామి, లక్ష్మణ్ పాల్గొన్నారు. – తాంసి

వసతులు కల్పించాలంటూ ఫిర్యాదు


మాట్లాడుతున్న అపార్ట్‌మెంట్ వాసులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద గల తిరుమల డెవలపర్స్ అపార్ట్‌మెంట్‌లో మౌలిక వసతులు కల్పించడం లేదంటూ యజమానులపై అపార్ట్‌మెంట్ వాసులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యజమానులు అనుమల్ల వెంకట్‌రెడ్డి, పెరుక ప్రతాప్, గుజ్జుల ప్రశాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్‌స్టేషన్ ఎదుట అపార్ట్‌మెంట్ వాసులు మాట్లాడుతూ 2013లో నస్పూర్ శివారు సర్వేనంబర్ 94లో తిరుమల డెవలపర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అపార్ట్‌మెంట్‌లో మొత్తం 48 ప్లాట్లు ఉన్నాయని పేర్కొన్నారు. చాలా ఏళ్లుగా లిఫ్టులు, కాంపౌండ్ వాల్, సీసీ కెమెరాలు, మెట్ల పక్కన రెయిలింగ్ ఏర్పాటు చేయలేదని, ఎర్తింగ్ లేదని, ఫ్లోరింగ్ అసంపూర్తిగా ఉందన్నారు. అపార్ట్‌మెంట్ వాసులు లక్ష్మారెడ్డి, రాంచందర్, సత్తయ్య, లక్ష్మి, భవాని, పద్మ పాల్గొన్నారు.

పంగిడి అడవుల్లో అలుగు వేట


వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్‌డీవో భవానీ శంకర్


స్వాధీనం చేసుకున్న అడవి అలుగు

- 10 మందిపై కేసు నమోదు, అరెస్టు
- వెల్లడించిన ఎఫ్‌డీవో భవానీ శంకర్


స్వాధీనం చేసుకున్న ఫోన్లు, అలుగు అవశేషాలు, వెయింగ్‌మిషన్, టెస్టర్

ఖానాపూర్: నిర్మల్ జిల్లా దిమ్మదుర్తి అటవీ రేంజ్ పరిధిలోని ఖానాపూర్ మండలం బావాపూర్(ఆర్) పంచాయతీ పరిధి పంగిడి గూడెం అడవుల్లో అడవి అలుగును కొందరు వేటాడినట్లు ఎఫ్‌డీవో భవానీ శంకర్, ఎఫ్ఆర్వో కిరణ్ తెలిపారు. ఖానాపూర్ పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఆదివారం కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 19న ఖానాపూర్ మండలం జగన్నాథ్‌రావు చౌరస్తాలో కారులో వెళ్తున్న ముగ్గురితోపాటు అలుగు అవశేషాలు పట్టుకుని విచారించారు. అలుగును అడవి సారంగాపూర్‌కు తరలించి అక్కడి నుంచి క్రయవిక్రయాలు చేసే ముఠా సభ్యులకు చేరవేస్తున్నట్లు గుర్తించారు. ఈ ముగ్గురిని విచారించగా మరో ఏడుగురు నిందితులు ఉన్నట్లు గుర్తించి, మొత్తం పది మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో పట్టుకున్న వారిలో నిర్మల్, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన వారు ఉన్నారని ఎఫ్‌డీవో, ఎఫ్ఆర్వో పేర్కొన్నారు.

అక్రమ మార్గంలో సంపాదించేందుకే..

అక్రమ మార్గంలో సంపాదించేందుకే అడవి అలుగుకు ఇంటర్నేషనల్ మార్కెట్‌లో డిమాండ్ ఉందని కొందరు అపోహలు సృష్టించారు. దీన్ని కొనుగోలు చేస్తే సంపద రావడంతోపాటు ఆరోగ్యం మెరుగుపడుతుందని, రూ.5 లక్షలు ఆ పైచిలుకు ధరకు విక్రయించేందుకు ఈ దందాకు తెరలేపారు. అడవిలో పట్టుకున్న అలుగు నుంచి కరెంట్ ఉత్పత్తి అయ్యేలా చూపేందుకు ఫేక్ టెస్టర్‌ను తయారుచేసి ఈ దందాను కొనసాగిస్తున్నట్లు గుర్తించారు.

10 మందిపై కేసు, అరెస్టు..

ఈ కేసులో ముందుగా నిజామాబాద్‌కు చెందిన ఫయాజ్, గంగాప్రసాద్‌తోపాటు జగిత్యాల జిల్లాకు చెందిన అహ్మద్‌ఖాన్‌ను పట్టుకుని విచారించారు. ఖానాపూర్ మండలానికి చెందిన గణేశ్, బారిక్ రావు, నాగేశ్, విజయ్, నాగారావు, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం లింగట్లకు చెందిన శ్రీరాం, జగిత్యాల జిల్లా ఇస్లాంపూర్‌కు చెందిన రియాజ్ అహ్మద్‌ను గుర్తించి కేసు నమోదు చేశారు. వారి నుంచి 9 సెల్‌ఫోన్లతోపాటు ఒక కారు, బైక్, ఒక వెయింగ్ మిషన్, ఒక టెస్టర్, అలుగు పొలుసులు, ఒక అలుగును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిని రిమాండ్ చేయనున్నారు. ప్రస్తుతానికి విచారణ కొనసాగుతుందన్నారు. సమావేశంలో డిప్యూటీ రేంజ్ అధికారి మహేశ్, ఎఫ్ఎస్‌వో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న టిప్పర్ సీజ్

సాత్నాల: మండలంలోని మేడిగూడ సమీపంలో అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై గౌతమ్ పవార్ తెలిపారు. పక్కా సమాచారంతో పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. డ్రైవర్, యజమాని వద్ద ఎలాంటి ధ్రువపత్రాలు, అనుమతి లేకుండా మొరం అక్రమంగా తరలించడంతో టిప్పర్‌ను చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మొరం అడ్డగుట్ట నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదు వచ్చిందన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఏఎస్సై స్వామి, టీసీ అఫ్జల్ ఉన్నారు.